బర్డ్‌ఫ్లూపై భయమొద్దు

బర్డ్‌ఫ్లూ భయం చికెన్ ప్రియులను వణికిస్తోంది. దీంతో చికెన్, కోడిగుడ్లు తినేందుకు జనం జంకుతున్నారు. ఫలితంగా చికెన్ విక్రయ దుకాణాలు, ఎగ్ సెంటర్లలో కొనుగోళ్లు గణనీయంగా తగ్గిపోవడంతో ఆయా యజమానులు నష్టాల బారిన పడుతున్నారు. రెస్టారెంట్లలో సైతం చికెన్‌తో చేసిన ఆహార పదార్థాల వినియోగం తగ్గుముఖం పట్టింది. అయితే మన ప్రాంతంలో బర్డ్‌ఫ్లూ ప్రభావం లేదని, వీటి వినియోగం విషయంలో ఆందోళన వద్దని పశువైద్యాధికారులు చెబుతున్నారు.

- తమిళనాడు నుంచి కోళ్లు రాకుండా ముమ్మర తనిఖీలు
- నిర్వాహకులు షెడ్లను శుభ్రంగా ఉంచుకోవాలి
- బాగా ఉడికించిన తరువాతే చికెన్, గుడ్డు తినాలి
- బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపిస్తే మమ్మల్ని సంప్రదించండి
- పశువైద్యశాఖ అధికారులు



కోళ్లకు వాడుతున్న మందులను పరిశీలిస్తున్న పశువైద్యాధికారులు, గుడిపాలలో బ్రాయిలర్ కోళ్లఫారాన్ని పరిశీలిస్తున్న పశువైద్య సిబ్బంది

గుడిపాల: రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో బర్డ్‌ఫ్లూ వ్యాధి ప్రబలుతున్న నేపథ్యంలో పశువైద్యశాఖ సిబ్బంది కోళ్లఫారాల యజమానులకు పలు సూచనలు చేస్తున్నారు. జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. అలాగే కోళ్లను ఉంచే షెడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, పరిసరాలను రోజూ శానిటేషన్ చేయాలని అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు చికెన్ విక్రయాలు భారీగా పడిపోయాయి.

ఎలా తినాలంటే..!

అలాగే చికెన్, కోడిగుడ్లను శుభ్రంగా ఉడికిన తరువాత తినాలని పశువైద్యాధికారులు చెబుతున్నారు. కోళ్లఫారం, చికెన్ సెంటర్లలో పరిశుభ్రత చర్యలు పాటిస్తే ఎటువంటి ప్రమాదం ఉండదన్నారు. లేదంటే కోళ్లకు వ్యాధి సోకే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

నియోజవర్గంలో కోళ్ల సంఖ్య ఇలా..

చిత్తూరు నియోజకవర్గంలో అధికారుల లెక్కల ప్రకారం గుడిపాలలో 18, చిత్తూరులో 22 కోళ్ల ఫారాలు ఉన్నాయి. ఇందులో బ్రాయిలర్స్ కోళ్ల 1,45,000, లేయర్స్ కోళ్ల 3,35,000, నాటుకోళ్ల 25 వేలు వరకు ఉన్నాయి.

చెక్‌పోస్ట్ వద్ద ప్రత్యేక తనిఖీలు

గుడిపాల మండలం తమిళనాడు సరిహద్దులో ఉండడంతో తమిళనాడు నుంచి ఏవైనా కోళ్ల ఆంధ్ర ప్రాంతానికి వస్తున్నాయా అని పశువైద్యాధికారులు పోలీసుల సహాయంతో తనిఖీలు చేస్తున్నారు. బర్డ్‌ఫ్లూ కారణంగా తనిఖీలను ముమ్మరం చేశామని పశువైద్యాధికారులు చెబుతున్నారు.


గుడిపాలలో వెలవెలబోతున్న చికెన్ సెంటర్

ఎటువంటి భయాందోళన వద్దు..


చికెన్, కోడిగుడ్ల వినియోగంలో ఎటువంటి భయాందోళన అవసరం లేదు. మన ప్రాంతంలో ఎటువంటి బర్డ్‌ఫ్లూ లేదు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఎక్కడైనా కోళ్లు మరణిస్తే ఆందోళన చెందకుండా పశువైద్య సిబ్బందిని సంప్రదించాలి. కోళ్ల ఫారాలను పరిశీలించి జాగ్రత్తలపై అవగాహన కల్పించాం. ఎక్కడైనా అనుమానిత లక్షణాలు కనిపిస్తే తక్షణమే పశువైద్య సిబ్బందిని సంప్రదించాలి. –సాయిసుధ, పశువైద్యాధికారి, గుడిపాల

చికెన్ వ్యాపారం తగ్గింది


గత 20 రోజులుగా చికెన్ వ్యాపారం తగ్గింది. ప్రజల్లో బర్డ్‌ఫ్లూ భయం చాలా ఉంది. అయితే అధికారులు మాత్రం మన ప్రాంతంలో బర్డ్ ఫ్లూ వ్యాధి లేదని చెప్పారు. అయినా ప్రజలు మాత్రం కొంత భయాందోళనలో ఉన్నారు. ఆదివారం రోజు 300 కేజీలు చికెన్ అమ్మకాలు జరిగేవి. ప్రస్తుతం 100 కేజీలు మాత్రమే అమ్ముడుపోతుంది. –శ్రీనివాసులు, చికెన్ వ్యాపారి, గుడిపాల

క్లుప్తంగా

నమోదు ప్రక్రియ పరిశీలన


నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి

చిత్తూరు రూరల్(కాణిపాకం): రైతు విశిష్ట గుర్తింపు కార్డు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ ఆదేశించారు. చిత్తూరు మండలంలోని దిగువ మాసాపల్లి రైతుసేవా కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నమోదు ప్రక్రియ పనితీరును పరిశీలించారు. నిర్ణీత సమయంలో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్డు ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని రాముల గుడివీధిలోని జైన్‌సంఘ ప్రార్థన మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సుభాష్‌జైన్ తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు క్యాంపు జరుగుతుందని, చిత్తూరు వాసులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శ్రీకాళభైరేశ్వర ఆలయం ముస్తాబు


ముస్తాబైన శ్రీ కాళభైరేశ్వర ఆలయం

తవణంపల్లె: మండల కేంద్రం తవణంపల్లెలో వెలసిన శ్రీకాళభైరేశ్వర ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయానికి రంగులు వేసి అలంకరించారు. మహాశివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాటు చేస్తున్నారు. అందులో 24వ తేదీ సోమవారం ఉభయదారులచే ధ్వజారోహణం, అభిషేకం, అన్నాభిషేకం, రాత్రి 7 గంటలకు శేషవాహన సేవ ఉంటుంది. ప్రతిరోజూ వివిధ రకాల పూజలు జరుగుతాయి. చివరిరోజు మార్చి 2వ తేదీన ఆదివారం ఉదయం అభిషేక పూజలు, రాత్రి 7 గంటలకు పుష్పపల్లకి సేవ జరుగుతుంది. ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు కోరారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్యసేవలు


టీబీ వ్యాధిపై మాట్లాడుతున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్యసేవలు అందజేస్తున్నట్లు బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత తెలిపారు. శుక్రవారం పానాటూరు ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ పరిధిలో టీబీ అలర్ట్ ఇండియా సహకారంతో ఆరోగ్యకాంపు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా 90 మందికి టీబీ, ఆస్తమా, బీపీ, డయాబెటిక్ పరీక్షలతో పాటు ఆరోగ్య సమస్యలపై స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. బీసీజీ వ్యాక్సిన్‌ను 18–60 ఏళ్లు పైబడిన వాళ్లు తప్పక వేసుకోవాలన్నారు. తరచూ దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, గళ్లలో రక్తం పడడం లాంటి లక్షణాలు ఉంటే వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ఊపిరితిత్తుల సమస్యలపై ఆస్తమా, సీఓపీడీ, సిలికోసిస్‌పై డాక్టర్ రష్మిత, చీలాపల్లె సీఎంసీ డాక్టర్ అశ్విన్ అవగాహన కల్పించారు. ఇందులో 12 టీబీ గళ్ల పరీక్ష శాంపిల్ సేకరించారు. క్యాంపులో టీబీ అలెర్ట్ ఇండియా ఫీల్డ్ ఆఫీసర్ సోమశేఖర్, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, డీటీ సూపర్‌వైజర్ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

చిత్తూరు అర్బన్: గుడిపాల మండలంలోని రాసనపల్లి పిల్లిగుట్ట ప్రాంతంలోని సారా తయారీ స్థావరాలపై శుక్రవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 800 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చిరు వ్యాపారులపై అదనపు భారం సరికాదు

చిత్తూరు కార్పొరేషన్: చిరువ్యాపారులపై విద్యుత్ ఒడ్డనను ఉపసంహరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఏపీఈఆర్సీ విద్యుత్ టారిఫ్ (చార్జీలు) ప్రకటించిందన్నారు. చిరు వ్యాపారులపై టైమ్ ఆఫ్ డే పేరిట అదనపు భారం వేయడం దారుణం అన్నారు. ఇప్పటికే మాల్స్ పెరుగుదలతో చిరువ్యాపారాలు దెబ్బతిందన్నారు. టైమ్ ఆఫ్ డే పేరిట సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు యూనిట్‌కు 50 పైసల నుంచి రూపాయి వరకు అదనపు చార్జీ విధించడం దారుణమన్నారు. ఆ భారం కోనుగోలుదారుల పైన పడుతుందన్నారు. గంట గంటకు రేటు మార్చడం కోసం వాడకాన్ని లెక్కగట్టడానికి స్మార్ట్ మీటర్ ఉంటేనే సాధ్యమవుతుందన్నారు. అందుకే ముందుగానే స్మార్ట్ మీటర్లను పెడుతున్నారని తెలిపారు.

నేడు నగరంలో విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. కొంగారెడ్డిపల్లె, మల్లికార్జునకాలనీ, కట్టమంచి, రెడ్డిఅండ్‌రెడ్డి కాలనీ, లాయర్స్‌కాలనీ, వెంగళరావుకాలనీ, రీడ్స్‌పేట, ఎస్పీబంగ్లా, జేసీ బంగ్లా ప్రాంతాలు, వెంకటేశ్వరకాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి


బంగారుపాళెం-2 సచివాలయాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

– జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

బంగారుపాళెం: గ్రామాల్లో ప్రజా సమస్యలపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ అన్నారు. శుక్రవారం బంగారుపాళెం–2 గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. వేసవిలో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. గ్రామాల్లో మంచినీటి ట్యాంక్‌లను నెలకోసారి శుభ్రం చేయాలన్నారు. సిబ్బంది సమయపాలన తప్పక పాటించాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లే సమయంలో మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. హైరిస్క్ కేసుల పట్ల జాగ్రత్త వహించాలని తెలిపారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లల ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ గ్రామాలకు రోడ్లు మంజూరు అయ్యాయని, జెడ్పీ, ఎంపీ గ్రాంట్ కింద 10 రోడ్లు వేయనున్నట్లు తెలిపారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించండి

బంగారుపాళెం ఇందిరమ్మ కాలనీలో డ్రైనేజీ సమస్య ఉందని కాలువ నిర్మాణానికి సహకరించాలని మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. వీఆర్‌ఓలతో పలు విషయాలపై సమీక్షించారు. భూసమస్యలపై వచ్చే ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన గ్రామ కార్యదర్శులతో సమావేశమై.. గ్రామాల్లో ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీధర్, ఆర్‌ఐ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

అగస్తీశ్వరస్వామి ఉత్సవాలు ప్రారంభం

పుంగనూరు: మండలంలోని నెక్కుంది కొండలపై ఉన్న అతిప్రాచీన దేవాలయం శ్రీ అగస్తీశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలకు శుక్రవారం అంకురార్పణ చేశారు. మార్చి3 వ తేదీ వరకు శివరాత్రి ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. ఈ నెల 26న మహాశివరాత్రి సందర్భంగా అభిషేకం, సింహవాహనోత్సవం నిర్వహిస్తామన్నారు.

రాహుకాల అభిషేక పూజలు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు చేశారు. వేకువ జామున ఆలయాన్ని శుద్ధిచేసి అమ్మవారి గర్భాలయానికి మామిడి, వేపాకు, పూలతోరణాలతో సుందరంగా ముస్తాబుచేశారు. రాహుకాల సమయం 10.30 నుంచి 12 గంటల మధ్యలో రాహుకాల అభిషేక పూజలు చేశారు.

తొలిరోజు పూజ

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల సమీపం వగ్లవారిపల్లె సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీ ఎల్లమ్మ తల్లి ఆలయంలో తొలిరోజు గంగపూజ, గణపతి పూజలు నిర్వహించారు. యాగశాలలో 11 మంది వేదపండితులు ఆలయ కమిటీ చైర్మన్ గోటూరు మురళీమోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కలశాలను ఊరేగింపు తీసుకొచ్చి భక్తి శ్రద్ధలతో సమర్పించారు.



పుస్తకాల అధ్యయనంతో మార్పు


మాట్లాడుతున్న గంగరాజు

చిత్తూరు కార్పొరేషన్: పుస్తకాలను అందరూ అధ్యయనం చేస్తే సమాజంలో మార్పు వస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు తెలిపారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో రెడ్‌బుక్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు కమ్యూనిజాన్ని చూసి భయపడడం ప్రారంభమైందన్నారు. అంతర్జాతీయంగా వామపక్షాల శక్తి రోజురోజుకు పెరుగుతోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 2020 నుంచి ప్రతి సంవత్సరం రెడ్ బుక్స్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం ఒక పుస్తకాన్ని ఎంపిక చేసుకుని ప్రాచుర్యం కల్పించి అధ్యయనం చేయడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది లెనిన్ రచించిన రాజ్యం విప్లవం అనే పుస్తకాన్ని ఎంపిక చేశారన్నారు. ఈ పుస్తకాన్ని భగత్‌సింగ్ ఉరి తీసే సమయంలో చదివినట్లు గుర్తు చేశారు. ప్రపంచంలో కమ్యూనిస్టులే ప్రధాన శత్రువు అని ట్రంప్ ప్రకటించారంటే వారి ప్రభావం ఏంటో అర్థం అవుతుందన్నారు. యువతరం ఆశలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. నేటి యువతరానికి లెనిన్, స్టాలిన్, పుచ్చలపల్లి సుందరయ్య, అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ లాంటి అభ్యుదయ పోరాట యోధులు రచించిన పుస్తకాలను అధ్యయనం చేసి పాలకుల మోసాలను ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్రన్, గిరిధర్ గుప్తా, బాలసుబ్రమణ్యం, చిట్టెమ్మ, జయంతి, రాజా, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి పూజలు



వి.కోట: పట్టణ నడిఒడ్డున వెలసిన శ్రీ వీరాంజనేయస్వామి వారి పుష్పపల్లకీ సేవ శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు దండోప తండాలుగా వచ్చి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. సాయంత్రం స్వామివారికి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి చేతుల మీదుగా స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామి వారి పల్లకి సేవను తిలకించారు. స్వామి వారి పల్లకి సేవ రాత్రి 10 గంటలకు ప్రారంభమై శనివారం వేకువజాము వరకు కొనసాగింది.

గర్భిణులకు వైద్యసేవలు

ఐరాల: గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేయించుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని నవటపల్లె, పత్తిపాటివారిపల్లె గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 95 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో గర్భిణులకు పలు రకాల పరీక్షలు నిర్వహించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గర్భిణుల్లో హైరిస్క్ ఉన్నవారిని ఆరోగ్యసిబ్బంది గుర్తించి వారికి అన్ని రకాల పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఆశావర్కర్లు హైరిస్క్ గర్భిణులు ప్రసవం అయ్యేవరకు వారికి సహాయంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రిలోనే ప్రసవం చేయించుకోవాలని చెప్పారు. అనంతరం ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు


గుడిపాల: విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీధర్

గుడిపాల: బాల్య వివాహాలు చేసుకుంటే భవిష్యత్‌లో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని మానసికంగా, ఆరోగ్యపరంగా సమస్యలు వస్తాయని చిత్తూరు వెస్ట్ సర్కిల్ సీఐ శ్రీధర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎస్సీ బాలికల సాంఘిక సంక్షేమ హాస్టల్, లక్ష్మీనరసింహ కాలేజీలో వివిధ చట్టాలు, నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళా సంబంధిత నేరాలు, సైబర్‌క్రైమ్, డ్రగ్స్, లోన్‌యాప్ మోసాలు, బాల్యవివాహాలు, రహదారి భద్రతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. బాలికలు, మహిళలు ఏదైనా ఆపద సమయంలో డయల్ 100 లేదా 112కు ఫోన్ చేసి తక్షణ సహాయం పొందాలన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. అపరిచితుల వ్యక్తుల నుంచి వచ్చే లింక్‌లపై క్లిక్ చేసేటప్పుడు లేదా డౌన్‌లోడ్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు, మొబైల్‌ఫోటోలు, ఓటీపీలను ఎవరితో పంచుకోకూడదన్నారు. సైబర్ క్రైమ్, ఫేక్‌లోన్ యాప్స్ మోసగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపినా, మైనర్లు వాహనం నడిపితే వాహనాన్ని సీజ్ చేసి వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఆయనతో పాటు ఎస్‌ఐ రామ్మోహన్ పాల్గొన్నారు.

మాతృభాషతోనే మానసిక వికాసం


ప్రశంసాపత్రాలు, పతకాలు అందుకున్న పీసీఆర్ పాఠశాల విద్యార్థులు


బంగారుపాళెం: గుండ్లకట్టమంచి జడ్పీ హైస్కూల్‌లో..

చిత్తూరు కలెక్టరేట్: మాతృభాషతోనే మానసిక వికాసం లభిస్తుందని సమగ్రశిక్ష శాఖ జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ఏపీసీ మాట్లాడుతూ మాతృభాషలో చదవడం, మాట్లాడడం వల్లే మానసిక వికాసం అభివృద్ధి చెందుతుందన్నారు. మాతృభాషలో ప్రావీణ్యం సంపాదించిన వారే ఇతర భాషల్లోనూ రాణిస్తారని చెప్పారు. తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథంనాయుడు మాట్లాడుతూ నీతిపద్యాలు, నీతి కథలు చదవడం, రాయడం నేర్చుకుంటే నైతిక విలువలు పెంపొందుతాయన్నారు. అనంతరం తెలుగు భాషా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పతకాలు, పుస్తక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎల్‌ఎస్ కో ఆర్డినేటర్ జయప్రకాష్ నాయుడు, రిటైర్డు టీచర్ సహదేవనాయుడు, ఇతరులు పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: మహోన్నతమైనది మాతృభాష అని మండల విద్యాశాఖాధికారి నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో తెలుగుతల్లి చిత్రపటానికి పూజలు చేశారు. గుండ్లకట్టమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో ఎంఈఓ పాల్గొన్నారు. హెచ్‌ఎం బేరినాథ్ మాట్లాడుతూ వివిధ దేశాలు, రాష్ట్రాల్లో వారి వారి మాతృభాషలను గౌరవిస్తున్నారన్నారు. అదే విధంగా మన మాతృభాష తెలుగును గౌరవించాలని సూచించారు. ఇతర భాషలకు లేని అనేక ప్రత్యేక లక్షణాలు మన తెలుగుభాషకు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రతాప్‌సుందర్ రాయల్ రెడ్డి, హాజరైన సభ్యులు, అధికారులు

- ఎంపీపీ ప్రతాప్ సుందర్ రాయల్‌రెడ్డి

తవణంపల్లె: మండల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సహకరించాలని ఎంపీపీ ప్రతాప్‌సుందర్ రాయల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ వేసవికాలం సమీపిస్తుండడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యులు భారతి మాట్లాడుతూ రాయితీతో మంజూరు చేసే సోలార్ విద్యుత్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీడీఓ రెడ్డిబాబు మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. తహసీల్దార్ సుధాకర్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని వివరించారు. రీసర్వే కోసం పైలట్ గ్రామాలైన చెర్లోపల్లె, వెంగంపల్లెలో మళ్లీ తప్పులు లేకుండా రీసర్వే చేయిస్తున్నట్లు వెల్లడించారు. ఇంటి పట్టాల కోసం కొత్తగా వచ్చిన అర్జీలను పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు భూమిని పరిశీలించి ఒక్కొక్కరికి 3 సెంట్లు భూమి కేటాయిస్తామన్నారు. రేషన్‌కార్డులో చేర్పులు, మార్పులు, తొలగింపునకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. గతంలో చేసిన రీసర్వేపై, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఐరాల సీడీపీఓ నిర్మల మాట్లాడుతూ గ్రామాల్లో బాల్యవివాహాలు అరికట్టడానికి ప్రజాప్రతినిధులు, సభ్యులు సహకరించాలని కోరారు. అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాలు పూర్తి చేయడానికి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఎగువ తవణంపల్లె దగ్గర బహుదానదిలో కొట్టుకుపోయిన చెక్‌డ్యాంకు మరమ్మతులు చేయించాలని ఎంపీటీసీ డేవిడ్ తెలిపారు. వ్యవసాయాధికారి జి.ప్రవీణ్ ప్రసంగిస్తూ రైతులు ఫార్మర్ రిజిస్టర్‌లో తమ భూమి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. డిజిటల్ గుర్తింపు కార్డు ఉన్న వారికే ప్రభుత్వ ఫలాలు అందుతాయన్నారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులు గుర్తింపు కార్డు కోసం తప్పక నమోదు చేసుకోవాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శోభారెడ్డి, అరగొండ విద్యుత్‌శాఖ ఏఈ కిశోర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.